# జర్నలిస్ట్ కథలు

## అమెరికన్

జొన్నలగడ్డ రాధాకృష్ణ

ప్రజాగోల ఆఫీసులో రెండు కొత్త శాల్తీలు చేరాయి. ఒక శాల్తీ పేరు హయగ్రీవరావు అనీ, అతను కొత్త డిప్యూటీ ఎడిటర్ అనీ పరిచయం చేశాడు ఎడిటర్ త్రయంబకం.

న్యూసెడిటర్ సుబ్బారావు ఈ దెబ్బకి గతుక్కుమన్నాడు. ఈ హయగ్రీవరావు ముమ్మందు తన మొగుడు కాగలడనే విషయం గుర్తించడానికి సుబ్బారావుకి ఎక్కువ టైము పట్టలేదు.

ఈ హయగ్రీవరావు కాళ్ళు రెండూ వేరే వేరే వాళ్ళవిలా ఉన్నాయి. ఎడమ కాలు పొడుగూ కుడి కాలు పొట్టీ ఉంది. ఈ కారణంగా అతగాడు ఫుట్‌పాత్‌ని ఆనుకుని ఓ కాలు ఫుట్‌పాత్ మీదా మరోకాలు నేలమీదా ఉంచి నడవడం ద్వారా తన రెండు కాళ్ళూ సమానంగా వున్నాయన్న దురభిప్రాయాన్ని ప్రజానీకానికి కలిగిస్తూ వుంటాడనీ కొన్నాళ్ళ తరవాత ప్రజాగోల ఇన్వెస్టిగేటివ్ రిపోర్టర్ గుర్నాథం పరిశోధనలో తేలింది.

హయగ్రీవరావుకి బవిరి గడ్డం ఉంది. తనకి మేధాశక్తి పుష్కలంగా వుందనే అపోహ జనాలకి కలిగించడానికే అతగాడు గడ్డం పెంచినట్టు కూడా గుర్నాథం విశ్వసనీయ వర్గాల ద్వారా సేకరించిన భోగట్టా.

హయగ్రీవరావుకి చెవిలో మిషను ఉంది.

అవతలవాడు చెప్పింది తను వినదల్చుకోనప్పుడు అతగాడా మిషను బయటికి లాగేస్తాడనేది అభిజ్ఞవర్గాల అభిప్రాయం.

అలాగే మన్మధరావు అనే జనరల్ మేనేజర్‌ని కూడా పరిచయం చేశాడు త్రయంబకం. ఈ మన్మధరావు మొదటిరోజున ఫుల్ మేకప్‌లో ఫుల్ సూట్‌లో కారులో వొచ్చాడు. అయితే ఆ కారుని ఇద్దరు తోసుకుంటూ రావడం చేత ప్రజాగోల స్టాఫ్‌కి అది కొంత కామెడీగా కనిపించింది. అయితే అతగాడి కారుని కూలంకషంగా ఇంటి నుంచి ఆఫీసు దాకా తోయవలసిన పనిలేదని, మధ్య మధ్య ఆగిపోయినప్పుడు మాత్రమే తొయ్యవలసి ఉంటుందని, ఆ కార్యక్రమానికి కూడా కేవలం ఇద్దరు మనుషులు మాత్రం సరిపోతారనీ కూడా గుర్నాథం సమాచారం సేకరించాడు.

ఆ రోజు త్రయంబకం మందస్తుగా తను ఆ రోజు పాఠకుల మీద ప్రయోగిస్తున్న రెండు పద్యాలు చదివి వినిపించిన మీదట ఆ ఇద్దర్నీ పరిచయం చేశాడు. మన్మధరావునైతే డైరెక్ట్‌గా అమెరికా నుంచి ఇంపోర్ట్ చేసినట్టు చెప్పాడు. వీళ్ళిద్దరూ కలిసి పేపర్ని విపరీతంగా ఇంప్రూవ్ చెయ్యబోతున్నట్టు కూడా ప్రకటించాడు.

ఆ తరవాత హయగ్రీవరావు ఈ క్రింది విధంగా ప్రసంగించాడు.

"ఏ పేపర్ సర్క్యులేషనైనా ఎలా పెరుగుతుంది? ప్రజలు ఆ పేపరు కొనడం చేత. ప్రజలెందుక్కొంటారు? వాళ్ళక్కావలసినవి పేపర్లో వుండటం చేత. ప్రజలక్కావలసినవి ఏవి? మర్డర్లు దోపిడీలు మానభంగాలు, మారణహోమాలు. ఇలాంటి వాటిని మనం బాగా ఎంకరేజ్ చెయ్యాలి ఇలాంటి వార్తలు వొస్తే వాటిని బ్యాన్ చెయ్యాలి. ఒక హత్య జరిగిందనుకోండి. వుత్తినే హత్య జరిగింది అని రాస్తే సరిపోదు. ఎలా జరిగిందో రాయాలి. రక్తం ఎలా చిమ్మిందో రాయాలి. డిస్క్రిప్షన్ కావాలి. ఆ వార్త పేపర్లో ప్రింట్ చేసేటప్పుడు ఆర్టిస్టు పేపర్ మీద రక్తం వొలికిన ఎఫెక్ట్ తీసుకురావాలి. అలాగే మానభంగం, ఎలా జరిగిందో వివరంగా రాయాలి. శవాలమీద, నేరాల మీదానే పెరుగుతుంది సర్క్యులేషన్. మన పోలీసుల ధర్మవా అని శవాలకి ఎలాంటి కొరతాలేదు. ఓన్లీ మనం వాటిని సరిగా ఉపయోగించుకోవడం లేదు. రోజూ పొద్దున్నే ఆఫీసుకి రాగానే మన రిపోర్టర్లు అందరికీ టెలిప్రింటర్లమీద మెసేజ్ కొట్టెయ్యాలి. మర్డర్లూ మానభంగాలూ ముందు కానిచ్చెయ్యమని..."

"ఏవిటీ మన రిపోర్టర్లే చెయ్యాలా ఇవన్నీ?" అన్నాడు కబ్ రిపోర్టర్ కమలనాథం తీవ్ర దిగ్భ్రాంతితో."

"అబ్బాయ్! ఈ మధ్యనే చేరినట్టున్నావ్. ఇంకా అమాయకత్వం పోలేదు. ఈ మీటింగ్ అయిపోగానే గుర్తు చేసి మెమో తీసుకో. ఇంతకీ ఏం చెప్తున్నాను? ఆ! అవే శవాలు. మన అదృష్టం కొద్దీ గల్ఫ్‌యుద్ధం వొచ్చింది. జనం కుప్పలు తెప్పలుగా ఛస్తున్నారు. పోయినసారి గల్ఫ్‌యుద్ధంలో చచ్చిన వాళ్ళ ఫోటోలు తీసి వేసెయ్యండి. ఏం ఫరవాలేదు. ఎవడూ కనుక్కోలేదు. మనుష్యులకి లేదు గానీ శవాలకి సమానత్వం ఉంది. అన్ని శవాలూ ఒకేలా ఉంటాయి. గల్ఫ్‌లో బాంబు వేశారనుకోండి. వెంటనే బాంబు బొమ్మ వేసెయ్యాలి. హిరోషిమా, నాగసాకీ బాంబుల బొమ్మలుంటాయి పాత మాగజైన్లలో. అవి తీసి వేసెయ్యొచ్చు. బాంబులకీ ఉంది సమానత్వం. అన్ని బాంబులూ ఒకటేలా ఉంటాయి. మానభంగాలకీ ఉంది సమానత్వం. అన్ని..." అంటూ ఎందుకైనా మంచిదని ఎడిటర్ త్రయంబకం వైపు, తక్కిన ఎడిటోరియల్ జనాభా వైపు చూశాడు హయగ్రీవరావు. త్రయంబకం తను రాసుకున్న పద్యాలు చదువుకుని మురిసిపోతున్నాడు. వీడి స్పీచ్ బొత్తిగా విన్నట్టు కనిపించలేదు. తక్కిన స్టాఫ్‌లో ఎక్కువ మంది హావభావాలను బట్టి చూస్తే వాళ్ళంతా వాంతులు చేసుకోడానికి ఉవ్విళ్ళూరుతున్నట్టు కనిపించారు. అందువల్ల తన స్పీచి అక్కడితో ముగించేశాడు.

కొత్త డిప్యూటీ ఎడిటర్ హయగ్రీవరావుకి ఆ క్షణంలోనే డ్రాక్యులా అనే పేరు ఖాయం చేసేశాడు గుర్నాథం.

ఇక రెండో శాల్తీ ఇంగ్లీషులో చేసిన ప్రసంగం తెలుగు పాఠం (వాడు మాట్లాడిన ఇంగ్లీషు తప్పుల్ని ఒప్పులుగా భావించి విశాల హృదయంతో అనువాదం చేసుకుంటే) ఈ క్రింది ప్రకారం వుంది.

"తెలుగు పేపర్లలో, ముఖ్యంగా ప్రజాగోలలో ఇంగ్లీషు విస్తృతంగా ఖూనీ అయిపోతోంది. అమెరికాలో ఇంగ్లీషు ఖూనీ అగుట లేదు. వారిని చూసి అనేక విషయాలు ముఖ్యంగా ఇంగ్లీషు భాషని బాధపెట్టకుండా ఉండటం మనమంతా నేర్చు

కోవాలి. ఉదాహరణకి తెలుగు పత్రికల్లో డాక్టర్ అని రాస్తున్నారు. కానీ దాన్ని 'డాక్టయ్' అని రాయాలి. ఆర్ సైలెంట్ అనే విషయం అమెరికాలో చిన్న పిల్లలకి కూడా తెలుసు. అందుకే అక్కడ 'వరల్డ్ ఈజ్ ఫుల్ ఆఫ్ గరల్స్' అనరు. ఆర్ వచ్చిన చోట కొంచెం సన్నాయి నొక్కు నొక్కితే నాజూగ్గా ఉంటుంది. ఈ సమావేశంలో చెప్పిన ఈ విషయాలు ఫాలో అయిపోయి వచ్చే సమావేశంలో మళ్ళీ చెప్పించుకోరాదు.''

ఈ మీటింగు అయిపోగానే కొందరు వాంతులు వేసుకున్నారు. మరికొందరు అనాసిన్, సారిడాన్ వగైరా బిళ్ళలు తెప్పించుకున్నారు. వెలాఖర్లో కూడా కాష్ బాలెన్స్ కాస్త వున్నవాళ్ళు లీవు పెట్టి మందుకొట్టడానికి వెళ్ళిపోయారు. సుబ్బారావు గుర్నాధం తమకి పిచ్చిపట్టడానికి ఇంకా ఎంతకాలం పడుతుంది అనే విషయం పై తర్జన భర్జన వేస్తున్నారు.

# స్టయిల్

ఈ లోగా ఓ కుర్ర సబెడిటర్ ఇందాక ఇద్దరు పెద్దలూ ఇచ్చిన స్పీచితో పుత్తేజితుడై ఓ వార్త ప్యూర్ అమెరికన్ స్టయిల్లో రాసి తీసుకొచ్చాడు. 'గురువుగారు చెప్పినట్టు ఆర్ సైలెంట్ వేసేశాను'' అని కూడా విశదం వేశాడు.

డాక్టయ్ చే నయిస్ మానభంగం

హైదయాబాద్, ఫిబ్రవరి 10

స్థానిక ఆస్పత్రిలో పనిచేసే ఒక డాక్టయ్ అదే ఆస్పత్రిలో పనిచేసే నయిస్‌ని మానభంగం వేసినట్టు ఇన్‌స్పెక్టయ్ తెలియజేశారు.

ఈ సంఘటన వివరాలు ఇలా వున్నాయి.

మానభంగానికి గురైన నయిస్ పిటపిటలాడ పోతూ వుండేదని మా విలేకరి తెలియజేస్తున్నారు. ఈమె సొంపుసొంపుల్ని డాక్టయ్ రోజూ మిడిగుడ్లు వేసుకుని చూస్తూవుండేవాడని, ముఖ్యంగా ఆమె డ్యూటీ టైములో నిద్దరపోతున్నప్పుడు రొట్టలు వేసే వాడని కూడా అభిజ్ఞవర్గాల ద్వారా తెలియవచ్చింది. నిన్నరాత్రి ఆ వార్డులో వున్న నలుగురు పేషంట్లూ చచ్చిపోయారు. దాంతో నయిస్ ఇక ఆ రాత్రి నిశ్చింతగా నిద్రపోవచ్చు అనే ధీమాతో ఆదమరచి నిద్రపోతోంది. ఇంతలో డాక్టయ్ వొచ్చాడు. యథాప్రకారం నయిస్ ఒంపుసొంపుల్ని చూస్తున్నాడు. అంతలో గుర్తొచ్చింది అదృష్టవశాత్తూ తన పేషంట్లు నలుగురూ ఒకేసారి కూడ బలుక్కున్నట్టు చచ్చిపోయిన సంగతి. మళ్ళీ తెల్లారితే కొత్త పేషంట్లు రావచ్చు. వాళ్ళు అంత ఈజీగా చావకపోవచ్చు ఇదే మంచి సమయం అని డాక్టయ్ మానభం. వ్యక్రమానికి ప్రారంభోత్సవం వేశాడు. నయిస్ గింజుకుంది. తను మానభంగం అవను గాక అవనని మొండికేసింది. అయినా విన్లేదు డాక్టయ్. సాధారణంగా ఇలాంటి కేసుల్లో అవతలవాళ్ళ పర్మిషన్ అడిగే సంప్రదాయం ఎక్కడా లేదని చెప్పాడు. మానభంగం కానిచ్చేశాడు. వార్డులో వున్న నాలుగు శవాల సాక్షిగా. ఆ శవాలు




మాట్లాడలేవు. అదే అతని ధీమా. ఒహవేళ మాట్లాడినా శవాల సాక్ష్యాన్ని ఇండియన్ పీనల్ కోడ్ ఒప్పుకోదని అతనికి తెలుసు. పనయ్యాక కాయిలో ఎక్కి వుధాయించేశాడు. డాక్టయ్ కోసం ఇన్‌స్పెక్టయ్ తీవ్రంగా గాలిస్తున్నాడు.''

వార్త చదివి సుబ్బారావు తల పట్టుకుని కూచున్నాడు.

"ఏం సార్ అలావున్నారు. ఒంట్లో బావు లేదా?'' అన్నాడు కుర్ర సబ్ ఎడిటర్.

"బావులేంది నా ఒంట్లో కాదు, నీ వార్త. దీన్ని చదివితే ఎంతటి ఆరోగ్యవంతుడైనా హాస్పిటల్ పాలవుతాడు.

"వార్తకేమైంది సార్, కొత్త మేనేజర్ గారు చెప్పినట్టు బ్రహ్మాండంగా వుందిగా. పూర్తి అమెరికన్ భాష. ఆర్ పూర్తిగా సైలెంట్ వేసేశా. కొత్త డిప్యూటీ ఎడిటర్ గారు చెప్పినట్టు మానభంగం వుంది, శవాలున్నాయి, యమా డిస్క్రిప్షన్ ఉంది. దగ్గిరుండి చూసినట్టు రాసేశా! ఆయన చెప్పినట్టు ఓ ఫోటో వేశామో అదిరిపోతుంది. మన రిపోర్టరు పేలవంగా ఒక డాక్టర్ ఒక నర్సుని మానభంగం వేశాడు. ఇన్స్‌పెక్టర్ గాలిస్తున్నాడు అని రాసి వదేశాడు సార్. ఇక చచ్చీ చెడీ తక్కినదంతా ఊహించి రాయాల్సొచ్చింది'' అన్నాడు కుర్ర సబెడిటర్.

"వార్త ఇలా రాస్తే సాధారణ పరిస్థితులు అయితే రాసిన వాడి ఉద్యోగం ఊడుతుంది. దీన్ని పేపర్‌లో వేస్తే వేసిన వాడు జైలుకి వెళ్ళాల్సి వస్తుంది. కానీ మనది పేపర్ ఆఫీసు కాదు. ఇదో సర్కస్ కంపెనీ. అంచేత ఇక్కడెలా జరుగుతోందో చెప్పలేం. కొత్త డిప్యూటీ ఎడిటర్‌కి చూపించు'' అన్నాడు సుబ్బారావు నిస్త్రాణంగా.

చూపించి వచ్చాక చెప్పాడు కుర్ర సబెడిటర్—కొత్త డిప్యూటీ ఎడిటర్ వార్త భేషుగ్గా ఉందన్నాడని, ఎక్కడో ఒక చోట కాస్త రక్తం వుంటే అది పరిపూర్ణ వార్త అయ్యేదనీ కూడా చెప్పాడనీ.

"ఏమో నాకు తెలిసినంత వరకూ దీన్ని వార్త అనరు. వాయ్త అంటారేమో'' అన్నాడు గుర్నాధం దిగులుగా.

ఆ మర్నాడు పేపర్లో ఆ వార్త అలాగే ప్రింటయి పోయింది. అయితే సుబ్బారావు ఊహించినవేం జరగలేదు. రాసినవాడి ఉద్యోగం పోలేదు—వేసినవాడు జైలుపాలవనూ లేదు.

ఎందుకంటే త్రయంబకంతో సహా సకల ఆంధ్రప్రజానీకం ఆ పేపర్ని చదవడం మానేసి చాలా కాలం అయింది గనక.

★